
ప్రజాశక్తి

సోమవారం 24 మార్చి 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





పాఠశాలల్లో మంత్రి పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : ఆటపాటలతో కూడిన చదువు విద్యార్థి మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రి నారాయణ నగరంలోని మూలపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, వేద సంస్కృత పాఠశాల, ఈ ఎస్ ఆర్ ఎం పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆటపాటలతో కూడిన చదువును అందించేందుకు తద్వారా విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసు కుంటున్నామన్నారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా పార్కుల అభివృద్ధి, మున్సిపల్ పాఠశాలల్లో జిమ్ ఎక్విప్మెంట్, ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలోని ప్రతి మున్సిపల్ పాఠశాల, పార్కుల్లో అధునాతన వసతులను కల్పించే లక్ష్యంతో సందర్శిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, ఇతర అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మెట్ట ప్రాంతాల అభివృద్ధి నీటి వనరులతోనే సాధ్యం..

ప్రజాశక్తి-ఉదయగిరి

వెనుకబడిన మెట్ట ప్రాంతాల అభివృద్ధి చెందాలంటే నీటి వనరులతోనే అది సాధ్యమవుతుందని రాయలసీమ తొమ్మిదవ ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసి రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక షాదీ మంజిల్ ఆవరణలో వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాలుగు వందల ఏళ్ల కిందట నీటి ప్రాముఖ్యత గురించి సుమతి శతకం లో పద్య రూపంలో స్పష్టంగా తెలిపారు. ఏ రంగమైన అభివృద్ధి చెందాలన్నా నీరు అవసరం ఉందన్నారు. సాగు, తాగునీరు, జల విద్యుత్తు, జల రవాణా పరిశ్రమలు, విద్యాభివృద్ధి చెందాలంటే నీటి అవసరం ప్రథమ ప్రాధాన్యతన్నారు. పడమట కనుమల్లో మహాబలిపురం కృష్ణానది పుట్టి సుమారు 1440 కిలోమీటర్లు ప్రవహించి నాలుగు రాష్ట్రాల ద్వారా కృష్ణాజిల్లాలోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుందన్నారు. ఈ నది పైన మహారాష్ట్రలో తెలంగాణలో కర్ణాటకలో అనేక ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టు ఆల్మట్టి ప్రాజెక్టు నారాయణపూర్ డ్యాం, తెలంగాణలో జూరాల, భీమ నెట్టెంపాడు మూడు ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో శ్రీశైలం రిజర్వాయర్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి మలక చర్ల వద్ద మూడుపాయలుగా చీలి తెలుగు గంగ, గాలేరు, నగరి కే సి కెనాల్ హంద్రీ, హంద్రీనీవా కు నీరు విడుదలవుతుందని అన్నారు. శ్రీశైలం ఆధారంగా వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేస్తే రాయలసీమ ప్రకాశం నెల్లూరు 4 లక్షల 38వేల ఎకరాలకు సాగునీరు 15 లక్షల మందికి తాగునీరు అందిస్తుందని తెలిపారు. తమిళనాడు రాష్ట్ర తాగునీటి అవసరాలు తీర్చేందుకు తెలుగు గంగ కాలువకు 1983లో దేశ ప్రధాని ఇందిరాగాంధీ తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజి రామచంద్రన్, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, కలిసి కడప జిల్లాలో శంకుస్థాపన చేశారు. 44 సంవత్సరాల అయినప్పటికీ సీరియల్ కొనసాగుతుందని ఎద్దేవ చేశారు. 1986 లో శంకుస్థాపన గాలేరి హంద్రీనీవా నిర్మాణం పూర్తి కాలేదని వెలుగొండ ప్రాజెక్టుకు 1994 లో శంకుస్థాపన చేసి 31 సంవత్సరాలు అయినప్పటికీ పూర్తి చేయలేక పోతున్నారన్నారు. ఆ ప్రాజెక్టుల నిర్మాణాలు చర్చలకే పరిమితిమైందన్నారు. గత ప్రభుత్వాలు సాగునీటికి అధిక ప్రాధాన్యతలు ఇచ్చేవారని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాగునీటి కోసం 45శాతం నిధులు కేటాయించారని తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

శ్రీశైలం నాగార్జునసాగర్, కృష్ణా, డెల్టా తదితర ప్రాజెక్టులు పూర్తి చేశామంటే అప్పటి ప్రభుత్వాలు సాగునీటి కోసం బడ్జెట్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారని తర్వాత ఆ ప్రాజెక్టులు పూర్తి ఆవ్వేవని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వాలు సంక్షేమరంగంపై మక్కువ చూపుతూ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నాయని విమర్శించారు. అనంతరం జిల్లా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, దామా వెంకయ్య, సిపిఎం నాయకులు కటారి అజయ్ కుమార్ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు సాధించుకోవాలంటే ప్రతి ఒక్కరూ భావితరాల భవిష్యత్తు కోసం ఐక్యమత్యంతో వెలిగొండ సీతారామసాగర్ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ సోమశిల హైలెవెల్ కెనాల్ సాధన పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ రిజర్వాయర్ లు పూర్తి చేసుకుంటే వెనుకబడిన మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు పుష్కలంగా ఉంటాయన్నారు. వలసల నివారణకు ఏకైక మార్గం ఈ రిజర్వాయర్లు పూర్తి చేసుకోవడమే అన్నారు. గతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని ఆదేవిధంగా ఇప్పుడు కూడా గ్రామ గ్రామానా ప్రతి వాడ నుంచి ప్రజలకు అవగాహన కల్పించి ఐక్యమత్యంగా ఈ రిజర్వాయర్లను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. తాగునీరు అందుబాటులో ఉంటే అనేక రకాల పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమాన్ని వెలిగొండ సాధన కమిటీ అధ్యక్షులు డాక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, రాయలసీమ సాధన కమిటీ అధ్యక్షులు బొజ్జ దశరథరెడ్డి, మూలే వెంగయ్య, వ్యవసాయ సంఘ నాయకులు పుల్లయ్య, లక్ష్మీపతి, ఎంపీపీ మూలే పద్మజ వినయ్ రెడ్డి, ఎంపీటీసీ కాకు విజయ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్ కుమార్ రెడ్డి సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి కొండ రమణయ్య రైతు నాయకులు కాకు వెంకయ్య, రాయుడు, వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నుల భారం తగదు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-నెల్లూరు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నగరపాలక సంస్థ 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలు చూస్తే రాబోయే సంవత్సరంలో నగర ప్రజల ముక్కు పిండి రూ. 222 కోట్లపన్నుల వసూలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అంచనాలు సిద్ధం చేయడం సరికాదని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు తీర్మానం చేశాయి. ఆదివారం ఉదయం నగరపాలక సంస్థ 2025-26 బడ్జెట్‌పై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో వివిధ రాజకీయపక్షాలు, ప్రజా సంఘాలు,నగరంలోని ప్రముఖులతో టౌన్ హాల్ రీడింగ్ రూమ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు.కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు ఎస్.కిరణ్ కుమార్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు వి.రామరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కె రాంబాబు ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు పాల్గొని అభిప్రాయాలను వెల్లడించారు. నగరపాలక సంస్థ 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలు చూస్తే రాబోయే సంవత్సరంలో నగర ప్రజల నుండి ముక్కు పిండి రూ.222 కోట్ల పన్నులు అంచనాలు సిద్ధం చేశారని విమర్శించారు. జలజీవన్ మిషన్ పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా నీరు అందిస్తామని చెపుతుంట నగరంలో రూపాయలు కొళాయి పన్నులు విధించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. నగరపాలక సంస్థ బడ్జెట్లో ప్రజలపై భారాలు మోపడమే లక్ష్యంగా పెట్టుకుని చేసిన ప్రతిపాదనలను తక్షణమే తొలగించాలని, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి ఉచితంగా సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని తదితర తీర్మానాలు చేశారు. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి నాగేశ్వరరావు,షేక్ నస్రీన్ బి, కే.పెంచల నరసయ్య,నగర కార్యదర్శివర్గ సభ్యులు పి.సూర్యనారాయణ,కాయంబు శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు సంజయ్, సుధీర్, సమాచార హక్కు చట్టం నాయకులు శ్రీనివాసులు, ఆదివాసి హక్కుల సంఘం నాయకులు బాబు, వ్యాపారస్తుల సంఘం నాయకులు మాల్యాద్రి, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నెల్లూరు నగర కార్యదర్శి బీపీ నరసింహ, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, సిపిఎం నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్, షేక్ జాఫర్, అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి, కెవి రమణారెడ్డి, మట్టిపాటి శ్రీనివాసులు ఉన్నారు.

రైతులకు తీవ్ర అన్యాయం : కాకాణి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : సర్వేపల్లి నియోజకవర్గం ఎంఎల్ఏ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రైతులను వదిలేసి, దళారులను వెంటపెట్టు కొని ధాన్యం పరిశీలనకు వెళుతున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన తోటపల్లిగూడూరు మండలం, పేడూరు గ్రామంలో పర్యటించారు.కాకాణి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలలో గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోయి అప్పుల ఊబిలో కూరు కుపోతున్నారన్నారు. ధాన్యం ధరలు రోజురోజుకీ పడిపోతున్నా ,అధికారులకు ప్రజా ప్రతి నిధులకు చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివద్ధి, సంక్షేమాన్ని, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, విధ్వంసఖండను బేరీజు వేసుకొ ని తిరిగి జగన్ ను సీఎం చేయాలని కోరుకుంటున్నారని కాకాణి పేర్కొన్నారు. తొలుత అనారో గ్యంతో మతి చెందిన వైసీపీ నాయకులు శ్యాంసన్ భౌ తిక ఖాయానికి కాకాణి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతి తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ బాలికల హాస్టల్ వార్షికోత్సవ వేడుకలు నింగి నంటాయని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో హర్ష వ్యక్తం చేశారు.ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వేడుకలు సాయంత్రం 4 గంటల వరకు నిర్విరా మంగా జరిగాయి. ఇంజినీరింగ్-డిప్లమో-డిగ్రీ నర్సింగ్ విద్యార్థినులు అలుపు-సొలుపూ లేకుండా పలు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేయడం విశేషం.ఈ సందర్భంగా వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రామయ్య మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు అవసరమైన ప్రాథమిక వనరుల ఏర్పాటులో కాలేజీని అగ్ర భాగాన నిలుపుతామని విద్యార్థుల హర్ష ధ్వానాల మధ్య వెల్లడించారు. టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లేస్మెంట్స్ లో అమ్మాయిలిదే అగ్రస్థానం కావడం హర్షదాయకమన్నారు. డిగ్రీ నర్సింగ్ విద్యార్థినులు రాష్ట్ర నలుమూలల నుండి వివిధ కేటగిరీలు వారు చేరిన ఎంతో ఐక్యంగా



ఉండటం ప్రకాశం సంస్కృతికి తార్కాండ మన్నారు. భారీ గజమాలతో యాజమాన్య ప్రతినిధులను విద్యార్థినులు కరస్పాండెంట్ కె రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే.విజయ్ శ్రీనివాస్‌ను అలంకరింప చేశారు. కరస్పాండెంట్ ను శాలువాతో సత్కరించారు. హాస్టల్ సిబ్బంది చందన విజయలక్ష్మిల ఆధ్వర్యంలో విద్యార్థినులు శాలువా కప్పారు.కాలేజీ డైరెక్టర్ శాసనమండలిలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ కుమారుడు అభి కార్తికేయ 9 సంవత్సరాలు తోబ,తోబ,కనులను తాకే ఓ కలా పాటలకు నృత్యం చేసి విద్యార్థి నులను ఆకట్టుకున్నారు. ప్లేస్మెంట్ సెల్ సహాయక అధికారి సుమలత కూతురు లక్ష్మీ శ్రావ్య బుజ్జి తల్లి, కాకినాడ తదితర మిశ్రమ పాటలకు డాన్స్ చేసి విద్యార్థులను ఉర్రూత లాగించారు. నర్సింగ్ విద్యార్థినులు ఆర్.కీర్తన ఆర్.నవ్య శ్రీ సుందరి-సుందరి, దివాలి, దివాలి పాటలకు డాన్స్ చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

నేడు ప్రజా దర్బార్

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా దర్బార్ జరగనుంది. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇచ్చేవారు అర్జీతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబరు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

రవాణా రంగాన్ని పరిరక్షించుకుందాం..

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు : రవాణా రంగాన్ని పరిరక్షించుకుందామని ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా పిలుపునిచ్చారు.నేడు ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఎఐ ఆర్టీడబ్ల్యూఎఫ్ చేపట్టిన చలో పార్లమెంట్ (ఢిల్లీ) కార్యక్రమానికి సంఘీభావంగా జిల్లాలోని సిటీకమిటీ, రూరల్ కమిటీలు మరియు అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమం చేయాలని జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత రవాణా రంగంపై పెద్దఎత్తున దాడి ప్రారంభించిందని విమర్శించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని కందుకూరు ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చాలా రోజుల నుంచి ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని ఆ సమస్య నివారణకు పట్టణంలోని పామూరు రోడ్డు సర్కిల్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి మహాదేవపురం రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.కందుకూరు పట్టణంలో కోట్లాది రూపాయలతో వెచ్చించిన ఎం.ఐ. జి లేఅవుట్ మిగతా నియోజకవర్గాల కంటే ధరలు అధికంగా ఉన్నందువలన, ధరలను మార్పు చేయాలని మంత్రి పి. నారాయణను కోరామని తెలిపారు. త్వరలో ప్రజలకు అందుబాటు ధర లోకి తిరిగి ప్లాట్లను తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. నియోజక వర్గంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులందరు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల

త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకం : డివైఎఫ్ఐ



డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన



17వ డివిజన్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరు : భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలు నేటితరం యువతకు స్ఫూర్తిదా యకమని డివైఎఫ్ఐ జిల్లా, నగర కార్యదర్శులు ఎం.వి.రమణ, బి.పి.నరసింహాలు పేర్కొన్నారు. శనివారం అమరవీరుల 94వ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలో కనకమహాల్ సెంటర్, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వద్ద నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వారకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాగడా ప్రదర్శన నిర్వహించారు. ఈ కాగడా ప్రదర్శనలో అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం

దేశ స్వాతంత్ర సాధన కోసం ఉరికంబం ఎక్కిన భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ ల 94వ వర్ధంతి పురస్కరించుకొని డివైఎఫ్ఐ భగత్ సింగ్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో మూడు జెండాల సెంటర్ నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 13,14,16 డివిజన్లో కమిటీల ఆధ్వర్యంలో చిత్రపటాలకు డివైఎఫ్ఐ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం 16వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని సైడ్ కాలువలో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమం నిర్వహించారు. నగర కార్యదర్శి నరసింహ మాట్లాడారు. డివైఎఫ్ఐ నాయకులు తిరుపతి జగదీష్, శేఖర్, ఖాజావలి అనిల్ సుధాకర్ మస్తాన్ శీను కుమార్ వెంకటేష్ శశి డివిజన్లో స్థానిక కమిటీ సభ్యులు మాజీ నాయకులు జి నాగేశ్వరరావు పి సూర్యనారాయణ జాఫర్ అల్లంపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు

యువతకు ఆదర్శం

భగత్ సింగ్,రాజ్ గురు ,సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా నెల్లూరు రూరల్ ప్రాంతంలో 10 ప్రాంతాలలో 94.వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాలలో భగత్ సింగ్ చిత్రపటానికి మాలవేసి మజ్జిగ చలివేంద్రాలు సేవా కార్యక్రమాలు కార్యక్రమాలు చేపట్టారు డివైఎఫ్ఐ రూరల్ కన్వీనర్ గోను చైతన్య, మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ,దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన వీరులు వారన్నారు. మాజీ డివైఎఫ్ఐ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కొండ ప్రసాద్, మాల కొండయ్య, ఈశ్వరయ్య, ఖలీల్, రఫీ , వీర్ల శ్రీనివాసులు, కష్ణమూర్తి, సుధీర్, బాపనయ్య , సురేష్,మరియు డివైఎఫ్ఐ రూరల్ కమిటీ సభ్యులు మధు, ఇక్బాల్, సుబ్రహ్మణ్యం, రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

17వ డివిజన్‌లో మెగా వైద్య శిబిరం

భగత్ సింగ్,రాజ్ గురు ,సుఖదేవ్ ల వర్ధంతి ని పురస్కరించుకోని 17వ డివిజన్ పరిధిలోని అపోలో సెంటర్ ప్రాంతంలో డివైఎఫ్ఐ, సిపిఎం నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిభిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. 17వ డివిజన్ సిపిఎం ఇన్‌ఛార్జి కట్టా సతీష్ మాట్లాడుతూ రక్తదాన శిభిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క యువకునికి అబి నందనలు తెలిపారు. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, రూరల్ కమిటీ సభ్యులు కె. పెంచలనర్సయ్య. సుధాకర్, 17వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి నజీర్, మహిళా సంఘం రూరల్ కార్యదర్శి షేక్ షాహీనా బేగం, సీనియర్ నాయకురాలు రమమ్మ ఉన్నారు.

వలేటివారిపాలెం : వలేటివారిపాలెంలో ప్రజా సంఘాల అధ్వర్యంలోసర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సభ జరిగింది. సభలో సిఐటియు నాయకులు జివిబి కుమార్ పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.భగత్‌సింగ్ సేవలను కొనియాడారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు సాదు. చెన్న కేశవులు, పర్రె. భాస్కర్ రావు ఉన్నారు.

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్ : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన గుడ్లూరులో డివైఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సిపిఎం నాయకులు జి వెంకటేశ్వర్లు. ఖాదర్ భాషా. రైతు సంఘం నాయకులు రామకష్ణయ్య, కొణిదల పెద్ద మాల కొండయ్య, ప్రజాసంఘాల నాయకులు సయ్యద్ సుభాని. డివైఎఫ్ఐ కార్యదర్శి గుత్తి మల్లికార్జున, సీతారామయ్య. శ్రీనివాసులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి-గుడ్లూరు : కామ్రేడ్ భగత్ సింగ్ 94వ వర్ధంతి గుడ్లూరు డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ ఆవరణలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ, సిపిఎం నాయకులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు.కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు గుత్తి మల్లికార్జున, దాసరి సీతారాం, కుర్ర మధు, గొర్ల సాయి కృష్ణ, సిపిఎం నాయకులు, దామా కృష్ణయ్య, ఎస్‌కె ఖాదర్‌బాషా, ఎస్ డి సుభాని, రామాల శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం కార్యదర్శి మూలం రమేష్, నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు ఎలా సాగుతున్నదో తెలుసుకునేందుకు ఆదివారం ఆత్మకూరు మండలంలోని కరటంపాడు, బోయిల చిరివెళ్ల, ఆత్మకూరు గ్రామాలను సందర్శించారు. ధాన్యం అమ్మకం విషయంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను రైతులతో చర్చించి తెలుసుకున్నారు. ఆత్మకూరు మార్కెట్ యార్డులో ఆరబోసుకున్న ధాన్యపు రైతులతో సంభాషించారు. ఈ సందర్భంగా రైతులు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రైతు సంఘం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మే విషయంలో ప్రభుత్వం ఇచ్చే గోనె సంచులు, రవాణా కోసం ఏర్పాటు చేస్తున్న లారీల విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. వాటిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అందువలన ప్రతిరోజూ ధాన్యాన్ని ఆరపోయడం మరలా బస్తాలకు ఎత్తడం కష్టతరంగా మారిందని తెలియజేశారు. ఈ బాధను భరించలేక ప్రయివేటు వ్యాపారస్తులకు దళారుల ద్వారా అమ్మే క్రమంలో పుట్టి ఒక్కంటికి మూడు వేల రూపాయలు నష్టపో తున్నామని తెలిపారు. ఈ విధంగా ఒక ఎకరాకు సుమారు పదివేల రూపాయలు నష్టపోతు న్నామని ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించ లేకపోయిందని తెలిపారు.గత సంవత్సరం తెలంగాణ మసూర 23 వేల రూపాయలకు విక్రయించామని ఈ సంవత్సరం 19 వేల రూపాయలకు మాత్రమే అడుగు తున్నారని ఈ రకం ధాన్యంలో పుట్టికి నాలుగు వేల రూపాయలు నష్టపోతున్నామని తెలియజేశారు. అనంతరం ఆత్మకూరు కొనుగోలు కేంద్ర మేనేజర్ శ్రీనివాసన్‌తో ప్రభాకర్ రెడ్డి ముచ్చటించారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుందన్నారు. పండించిన ధాన్యాన్ని అంతా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రకటించారని వాస్తవ పరిస్థితులలో అలా ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి తదనుగుణంగా రైతులకు కావాల్సిన గోనెసంచులను ఏర్పాటు చేసి రవాణా కోసం తగినన్ని లారీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున రైతు సంఘ నాయకులతో చర్చలు జరిపి వాస్తవ పరిస్థితులలో రైతులకు అండగా ప్రభుత్వాధికారులు నిలబడడం లేదని కొన్ని గ్రామాలలో ఒకరో ఇద్దరి వద్దను మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఇది ఐదు శాతం మాత్రమే ఉందన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలులో ఉన్న ఇబ్బందులను గమనించి ఇంకా 50శాతం ధాన్యం కోతలు మిగిలి ఉన్నాయని వాటిని అధిగమించేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య, వ్యకాస. జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్ కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు లక్కు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని వాక గ్రామానికి పొడమేకల చెంచయ్య, తిరుపతి, రమేష్, సుబ్బయ్య, బూచి మల్లికార్జున సన్నిబోయిన బాలయ్య పొడమేకల కృష్ణ కుటుంబాల వారు వైసీపీ పార్టీ రాజీ నామా చేసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎంఎల్ఏ ముందుగా పార్టీలో చేరిన అందరికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యమని తెలియజేశారు.. పాత, కొత్త నాయకులందరూ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు..ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కందుకూరు శాసనసభ్యులు శ్రీ ఇంటూరి నాగేశ్వరరావు నియోజకవర్గ అభివద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారని వారి అభివృద్ధిలో భాగస్వామ్యం కావటానికి పార్టీలో చేరుతున్నామన్నారు.నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, వాయల శ్రీను, పాదాల మురళీకృష్ణ, టి శ్రీకాంత్, పి సుబ్రహ్మణ్యం, పెల్లేటి శ్రీను, పాదాల జాలిరెడ్డి, పి చిరంజీవి పాల్గొన్నారు.



ఎంఎల్ఏ ఇంటూరి సమక్షంలో టిడిపిలో చేరుతున్న నాయకులు

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-కందుకూరు

ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్ లకు పాల్పడితే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి బాలసుబ్రమణ్యం తెలిపారు.కందుకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని తెలిపారు.గతంలో బెట్టింగులకు పాల్పడిన పాత నేరస్తుల వివరాలను సేకరించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారి పై నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఆన్ లైన్ ద్వారా బెట్టింగ్ కు పాల్పడినా, గుంపులు గుంపులుగా కూర్చుని సెల్ చూస్తూ బెట్టింగ్స్ వేస్తున్న అలాంటి వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.కుటుంబ సభ్యులు తమ బిడ్డలు కానీ, తమ భర్తలు కానీ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.క్రికెట్ బెట్టింగ్ వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. అంతేకాకుండా క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకుని అనేక మంది సూసైడ్ చేసుకుంటున్నారని, ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు.మీ చుట్టుపక్కల ఇళ్లలోగాని, షాపుల్లో గాని లేదా ఏదైనా ప్రదేశంలో గానీ క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లయితే వెంటనే పోలీసు వారికి తెలియపరచాలన్నారు. లేనిచో సదరు ఇళ్లు, షాపు లేదా ప్రదేశం యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని తెలిపారు.కికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారి సమాచారం ఎవరిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డయల్ 100/112 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



బాలసుబ్రమణ్యం, డిఎస్‌పి

సర్వీసు రోడ్డులో వెళ్లేందుకు అనుమతివ్వాలి

పజాశక్తి-నెల్లూరు : ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, తదితర ప్రాంతాల నుంచి నగరం వైపు ప్రయాణించే ప్రతి ఆర్‌టిసి బస్సులను సర్వీసు రోడ్డు నుంచి శ్రీ పొట్టిశ్రీరాములు ఆత్మకూరు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. నిత్యం వివిధ డిపోల నుంచి నగరంలోని పిఎస్ఆర్ బస్టాండ్‌కు వచ్చే ఆర్‌టిసి బస్సులు రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై దూరంగా వెళ్లి తిరిగి రావాల్సి వస్తుందని, దీని వల్ల ఆర్‌టిసి సంస్థకు నష్టం చేకురుతుందన్నారు. ట్రిఫిక్ సమస్య పెరుగుతుందన్నారు. దీని వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారన్నారు. ఆత్మకూరు బస్టాండ్‌లో పోలీసులు విధులు నిర్వహించి ప్రయాణికులకు, సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని నెల్లూరు 2 డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కె.చంద్రయ్య మంత్రి నారాయణకు అందజేశారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పరీక్షలు

ప్రజాశక్తి - గుడ్లూరు రూరర్ : గుడ్లూరు మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలోకలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలకు చదువు నేర్పించి వారందరికీ ఆదివారం ఆయా సెంటర్లలో ఎగ్జామ్స్ నిర్వహించారు. మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులు తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో మండలంలో గత నెల రోజులుగా ఉల్లాస్ కార్యక్రమం లో భాగంగా ప్రతి ఒక్కరు చదవడం, రాయడం కలిగి ఉండాలనే లక్ష్యంతో చదువు నేర్పించి ఈ పరీక్ష నిర్వహించారు .42 అంగన్‌వాడీ సెంటర్లలో మొత్తం 679 మంది పరీక్ష నిరమ్వహించారు. గుడ్లూరు మండల ఎపిఎం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరిగింది.



మరింత అభివృద్ధి చేపడతాం.. : మంత్రి ఆనం



ప్రజాశక్తి ఆత్మకూర్ అర్బన్

రాబోయే మూడు నెలల్లో ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ సంగంకు మంజూరై భవనాలు లేక ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఐటిఐ కళాశాలను సంగంలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. లాంకో ఇండస్ట్రీస్ అధినేత రాజగోపాల్ రెడ్డి వారి తండ్రి జ్ఞాపకార్థం సంగంలో ఉన్న రూ.8కోట్ల విలువైన భవనాలను ప్రభుత్వానికి అప్పగించారని, ఈ మేరకు లేఖను కూడా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అందజేసినట్లు తెలిపారు. మూడు నెలల్లో ఈ భవనాల్లో ఐటిఐ కళాశాల ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఆత్మకూరులో వంద పడకల ఆసుపత్రిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిగా మారుస్తూ గతంలో ఉత్తర్వులు ఇచ్చామని, రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లా ఆస్పత్రిగా ప్రకటించేందుకు ఆత్మకూరుకు విచ్చేయున్నారని, విడతల వారీగా 50 పడకల చొప్పున ప్రతి ఏడాది పెంచుకుంటూ 200 పడకల ఆసుపత్రిగా ఆత్మకూర్ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామని మంత్రి ప్రకటించారు. అలాగే ఇప్పటికే ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన బిసి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని, ఆ మేరకు బాలికల రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు కోసం భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ శాఖ నుంచి ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు రూ.53కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఆయన ఆత్మకూరు జిల్లా ఆసుపత్రులో పర్యటించారు. 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఆత్మకూరు పోలీస్ వారి సౌజన్యంతో ప్రయాణికులు, రోగులకోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. మంత్రివెంట ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్‌సి బీద రవిచంద్ర, ప్రజాప్రతినిధులు, ఆస్పత్రి సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, ఆర్‌డిఒ పావని, సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్‌ఎంఒ ఉషాసుందరి, ఎపిఎంఎస్‌ఐడిసి ఈఈ నిర్మల్ కుమార్, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తీరు మార్చుకుంటే కేసులు తీసేస్తాం..



ప్రజాశక్తి-కోవూరు : రౌడీలుగా, కేడీలుగా అనుమానితులుగా పోలీస్‌స్టేషన్లో రికార్డులకెక్కిన వారు ఇకనైనా బుద్ధిగా ఉండాలని, తీరు మార్చుకుంటే వారినిపై ఉన్న కేసులను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి జి.శ్రీనివాసరావు అన్నారు. కోవూరులోని పోలీస్ స్టేషన్లో ఆదివారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని కోవూరు, కొడవలూరు, బుచ్చి ఇందుకూరుపేట మండలాల పోలీస్ స్టేషన్లకు సంబంధించి రౌడీలుగా, కేడీలుగా రికార్డులకెక్కిన వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలపై, మహిళలపై కిరాయి హత్యలకు వెళ్లే వారిపై మాత్రం ఇప్పటికిప్పుడే రౌడీషీట్లు తొలగించే పరిస్థితి లేదన్నారు. తోకజాడిస్తే తోలు తీస్తామని, ఇకనైనా బుద్ధిగా ఉండాలని ఆయన రౌడీషీటర్లకు హెచ్చరించారు. మీకు ఏమైనా కౌన్సిలింగ్ కావాలంటే డిటిసిలో ప్రత్యేక కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఏదో క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకున్న వారు బుద్ధి తెలుసుకుని సత్ప్రవర్తనతో ముందుకు సాగాలన్నారు. అలాకాకుండా ఇంకా పాత ధోరణియే కొనసాగిస్తే అటువంటి వారిపై ప్రత్యేక నిఘాపెట్టి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి శివప్రియ, కోవూరు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్, ఎఎస్‌ఐ సత్యనారాయణ, ఐదు మండలాల హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు



ప్రజాశక్తి-వరికుంటపాడు : క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వరికుంటపాడు ఎస్‌ఐ ఎం.రఘునాథ్ హెచ్చరించారు. ఐపిఎల్ క్రికెట్ లీగ్ ప్రారంభమైన దృష్ట్యా బెట్టింగులపై ఎస్‌పి జి.కృష్ణకాంత్, కావలి డిఎస్‌పి పి.శ్రీధర్, ఉదయగిరి సిఐ వెంకటరావు ఆదేశాల మేరకు ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాలను పసిగట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. బెట్టింగులకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అలాగే బెట్టింగ్ యాప్‌లు అధికమైన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ప్రవర్తన ఆర్థిక లావాదేవులపై గమనించాలని సూచించారు. బెట్టింగ్ యాప్‌లతో కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నారని తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎస్‌సి వర్గీకరణ చట్టబద్ధతపై హర్షం



ప్రజాశక్తి-వరికుంటపాడు : ఎన్నోయేళ్లుగా ఎదురు చూస్తున్న మాదిగల పోరాట ఫలితమే ఎస్‌సి వర్గీకరణ ఈ అని ఎస్‌సిసెల్ మండల ప్రధాన కార్యదర్శి కొనిగిపోగు వెంగయ్య అన్నారు. ఎస్‌సి వర్గీకరణకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆమోదం తెలపడంతో ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పోరాటానికి ఫలితం అసెంబ్లీలో ఎస్‌సి వర్గీకరణను కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందిస్తున్నా మన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన 15శాతం రిజర్వేషన్ 59 కులాలకు అందవలసి ఉండగా కేవలం నాలుగైదు కులస్తులు మాత్రమే ఆ లబ్ధిని ప్రస్తుతం పొందుతున్నారన్నారు. 1994 ముందు ఎంఆర్‌పిఎస్ ప్రారంభం ముందు ఎవరు మాదిగ అని చెప్పుకోలేదని ఎంతోమంది మాదిగల పోరాట స్ఫూర్తి కృషితో నేడు గర్వంగా చెప్పుకోగలుగుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్గీకరణకు దోహదపడిన ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆదరణకేంద్రంలో జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట : వింజమూరు మండలం వాస్తవ్యులు నోటి మాల్యాద్రి రెడ్డి మనవడు మందిరెడ్డి సుధాకర్ రెడ్డి మౌనిక కుమారుడు లక్ష్మీనరసింహ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దాత నోటి మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ ఆదరణ కేంద్రంలో అనాథలకు తన మనవడు పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేల విలువగల నిత్యావసర వస్తువులు అందజేశామని, ప్రతి సంవత్సరం తనవంతు సహాయపడుతున్నానని, ఆదరణ కేంద్రం నిర్వాహకులు సింహాద్రి భవాని సేవలను అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, నోటి విజయమ్మ ఆదరణ కేంద్రంలోని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపొందేలా చర్యలు

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని ఎంపిక చేసిన గ్రామాల్లో ఉల్లాస్ కార్యక్రమం కింద పొదుపు గ్రూపుల పరిధిలో నిరక్షరాస్యులను గుర్తించి వారందరికీ గత కొంతకాలంగా రాత్రిపూట బడులు ఏర్పాటు చేసి వారిలో అక్షరాస్యత శాతం రూపొందించేలా విఒఎలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం మండలంలోని 32 సెంటర్లలో నిరక్షరాస్యులకు పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఈ కేంద్రాలను కోవూరు సంఘమిత్ర కార్యాలయంలో పనిచేస్తున్న సిసిలు రాజశేఖర్, చైతన్యబాబు, రాము, శోభలు పరిశీలించి పరీక్షలు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించారు.

నేడు 'గ్రీవెన్స్ డే'

ప్రజాశక్తి-దుత్తలూరు : దుత్తలూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ యనమల నాగరాజు తెలిపారు. గ్రీవెన్స్ డేకు అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేస్తే వెంటనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే భూ సమస్యలు ఉన్న రైతులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట గ్రామంలో తూర్పు వీధిలో వెలసి ఉన్న శ్రీ సాయిబాబా ఆలయంలో సాయి సత్సంగ పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదేవిధంగా సాయంత్రం గ్రామోత్సవం ఎఎస్‌పేటలోని ప్రధాన పురవీధులలో, అనుమసముద్రం గ్రామం వరకు, అధిక సంఖ్యలో మహిళలు సాయిబాబా కీర్తనలు చేసుకుంటూ, కోలాటం, విద్యుత్ కాంతులు, బాణాసంచా వెలుగులతో గ్రామోత్సవం కన్నుల విందుగా జరిగింది. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్‌ఐ భాస్కర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి

- కమిషనర్ ఎం.సూర్యతేజ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని పలువురు మేధావులు హెచ్చరిస్తున్నారు. ఈ హెచ్చరికలను ప్రజలు పట్టించుకోకపోవడం కారణంగా వాతావరణంలో అనూహ్యమైన మార్పులు సంభవించి పలు అనర్థాలు సంభవిస్తున్నాయి. రానున్న ప్రమాదాలను గుర్తించి అధికార యంత్రాంగం ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలకాలను పిలుపు నిస్తున్నారు. ఈ పిలుపులో భాగంగా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకానికి స్వస్థిపలకాలని కమిషనర్ సూర్యతేజ హెచ్చరిస్తున్నారు. మరిన్ని ఆయన మాటల్లోనే..



ఇంటర్వ్యూ

ప్రశ్న. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు. ఆ వస్తువుల తయారీని అరికట్టేందుకు ఎటువంటి ప్రయత్నం చేస్తున్నారు..?

జవాబు. పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నగరపాలక సంస్థలో అమలు చేస్తున్న సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధానాలతో ప్రజల్లో మంచి చైతన్యం కల్పించాం. పౌరులంతా బాధ్యతగా భావించి జనప నార, కాగితం, గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని కోరుతున్నాం. నగరపాలక సంస్థ పరిధిలో జరిగే వివాహ శుభకార్యాలు, పబ్లిక్ మీటింగులు, ఫంక్షన్ హాళ్లు, హెూటళ్ళు, వైన్ షాపులు, రెస్టారెంట్లలో ఏర్పాటు చేసే ఆహార పదార్థాల సరఫరాలో నిషేధిత సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగిస్తే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరికలు జారీ చేశాం. నగరవ్యాప్తంగా ఉన్న క్యాటరింగ్ నిర్వాహకులు, వెడ్డింగ్ ప్లానర్స్, ఇతర ఫంక్షన్ హాళ్ళ నిర్వాహకులు కార్యక్రమాల్లో భాగంగా వాటర్ బబుల్స్, డిస్పోజల్ ప్లాస్టిక్ గ్లాసులు, స్పూనులు, ప్లేట్లు, కవర్లు తదితర 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించినట్లు తమ దృష్టికి వస్తే నిర్వాహకులకు లక్ష రూపాయల వరకు భారీ జరిమానా విధిస్తామని ప్రకటించాం. నిషేధిత సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి దైనందిన జీవితంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నాం. వీధి వ్యాపారాలు, దుకాణాల నిర్వాహకులకు ప్లాస్టిక్ నిషేదించినట్లు తెలియజేసి, వాడకాన్ని నిరోధించాలని విజ్ఞప్తి చేశాం. మెప్మా ఆధ్వర్యంలో నార, గుడ్డ సంచుల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించి, పర్యావరణ హితమైన ఉత్పత్తుల వినియోగంతో చెత్తను తగ్గించవచ్చని పౌరులలో చైతన్యం కల్పించే ప్రయత్నం సైతం చేశాం. వాటర్ పాకెట్లను తయారు చేస్తున్న కేంద్రాలను గుర్తించి వాటిని వెంటనే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించాం.

ప్రశ్న. దేశవ్యాప్తంగా ఉన్నత మున్సిపాలిటీల ఎంపికలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు. సిబ్బందికి ఎటువంటి సలహాలు, సూచనలు చేశారు..?

జవాబు. దేశవ్యాప్తంగా ఉన్నత మున్సిపాలిటీల ఎంపికలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చాం. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పారిశుధ్య విభాగం వారాంతపు సమీక్షలో భాగంగా శానిటైజేషన్ అధికారులు, వార్డు సచివాలయ శానిటైజేషన్ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించాం. స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణ కోసం నగరంలో ఓట్ ఫర్ వెబ్, ఓట్ ఫర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను నగరవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నాం. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలంతా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో పాల్గొని, నిర్దేశించిన 10 ప్రశ్నలకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాం. డ్రెయిను కాలువలలో మురుగు నీరు సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన చర్యలను సచివాలయాల వారీగా నివేదికలు అందించాలని ప్రజలను కోరాం. డివిజన్ల పరిధిలో డ్రైను కాలువల్లో మురుగు నిల్వ ఉండకుండా క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. అవసరమైన చోట్ల ర్యాంపులు, కల్వర్ట్‌లు, సివిల్ పనులు, మెష్ ఏర్పాటు, లెవెలింగ్ పనులకు సంభందించిన యాక్షన్ ప్లాన్ చేపట్టి డ్రెయిను కాలువల మురుగు ప్రవాహానికి అంతరాయం లేకుండా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్నది. ఈ నేపథ్యంలో ఇంటి పన్ను, మంచినీటి పన్ను వసూళ్లు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మొండి బకాయి దారులనుంచి పన్నులు వసూలు చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను మొండి బకాయిదారులనుంచి పన్నులను వసూలు చేయాలని, లేని పక్షంలో ఆస్తులను జప్తు చేయాలని రెవెన్యూ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. రెవెన్యూ విభాగం, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాం. పన్ను బకాయిదారులు ఈ నెల చివరిలోపు బకాయిలు మొత్తం చెల్లించేలా కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. మొండి బకాయిదారులనుంచి వసూళ్లకు అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగిస్తాం. నెలాఖరు నాటికి నిర్ధేశించిన లక్ష్యాలను సాధించని వారికి, తక్కువ శాతం వసూలను చేపట్టిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. ఇప్పటికే కొంత మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పన్ను వసూళ్లలో ముందు వరసలో నిలిచే కార్పొరేషన్లలో నెల్లూరు నగర పాలక సంస్థను నిలిపేందుకు ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా వసూళ్లను చేపట్టాలని సూచనలు చేశాం.

ప్రశ్న. కోట్లాధి రూపాయలు ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన పార్కులు కొన్ని నిరుపయోగంగా ఉన్నాయి, కొన్ని పార్కులు కనీస సౌకర్యాలు, క్రీడా వస్తువులు సైతం లేకుండా నిరుపయోగంగా ఉన్నాయి. ఆ పార్కులను గుర్తించి మౌలిక వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో పిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.



ఎంఎల్‌ఎకు స్వాగతం పలుకుతున్న నాయకులు

రామతీర్థం బీచ్ అభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని రామతీర్థం, బీచ్‌ను పర్యాటక కేంద్రాలుగా రూపుదిద్ది అభివద్ధి చేస్తామని కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామతీర్థంలో తరంగ్ రిసార్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గతంలో ఎపి టూరిజం ఆధ్వర్యంలో నిర్మించిన రిసార్ట్ తరంగ్ రిసార్ట్స్ పేరిట పున:ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. రిసార్ట్ నిర్వాహకులైన ఈవెంట్స్ వెంకటేశ్వర రావును అభినందించారు. వీకెండ్స్ సందర్భంగా బీచ్ సందర్శించే పర్యాటకులకు తరంగ్ రిసార్ట్స్ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులతో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న రామతీర్థం గ్రామం తరంగ్ రిసార్ట్స్ నిర్మాణంతో పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి రిసార్ట్ యాజమాన్యాన్ని కోరారు. రిసార్ట్ నిర్వాహకులకు సహాయ సహకారాలు అందించి రామతీర్థం పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, టిడిపి మండల అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు, యువ నాయకులు బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, సత్యంరెడ్డి, ఆవుల వాసు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి కూటమి దొందూదొందే..

- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజం



ప్రజాశక్తి-ఉదయగిరి : వైసిపి, టిడిపి కూటమి పార్టీలు ఆంధ్ర రాష్ట్రానికి రాహు, కేతువులుగా దాపురించాయని ఆ రెండు దొందూ.. దొందే.. అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బి అధిక భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం పరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని ఆయన దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మద్యం, జూద, డ్రగ్స్, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసి వెళ్లి పోయిందని, కూటమి పాలనలో అంతకంటే అధ్వాన్నంగా తయారైందని ధ్వజమెత్తారు. మండలానికి నాలుగు మద్యం షాపులు 40 బెల్టు షాపులు అన్నట్లు మద్యం పాలసీ తయారయిందని దుయ్యబట్టారు. అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లుగా గతాని కంటే ఎక్కువ అప్పు చేస్తోందని వాపోయారు. ప్రజలపై బాదుడు కార్యక్రమం అమలు చేస్తూ విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15,485 కోట్ల అదనపు భారం మోపి, సూపర్ సిక్స్ హామీల అమలుపై చేతులెత్తేసిందని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించి, తల్లికి వందనం అమలు చేయకుండా తల్లులను, పిల్లలను మోసగించి, అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకుండా రైతులను మోస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆడబిడ్డ నిధి అడ్రసే, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం మైనారిటీలకు 50యేళ్లకే పెన్షన్ హామీ వూసే లేదన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని తింటే తెలుగు గారెలే తినాలని ఆంధ్ర రాష్ట్రాన్ని పాలించాలంటే కాంగ్రెస్ పాలనతోనే అది సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గం కాంగ్రెస్ కన్వీనర్ సోము అనిల్ కుమార్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మాజీ ఎంపిపి బాలయ్య, జగదీశ్, బాబురావు, బకీరు.హాజరతయ్య, అశోక్ కుమార్ రెడ్డి, అన్వర్, అమర్, ఉత్తన్న, రాజు, రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల భగత్‌సింగ్‌కు నివాళులు



కోవూరులో..



కావలిలో..



బుచ్చిలో..

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండల కేంద్రంలో పాటూరు రోడ్డులో సీతాపోలయ్య భవన్‌లో డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. బ్రిటీష్ వారి దాస్య శృంఖలాల నుంచి భారతదేశాన్ని విముక్తి గావించాలని ఎన్నో కుట్రల కేసులను ఎదుర్కొని చివరకు ఉరి కంభమెక్కిన భరతమాత ముద్దుబిడ్డ భగత్ సింగ్ అని కొనియాడారు. ఆయనతోపాటు రాజ్‌గురు, సుఖదేవ్ కూడా తమ ప్రాణాలను అర్పించి నేటి యువతరానికి దేశభక్తి నింపిన వీరులని డివైఎఫ్‌ఐ నాయకులు సురేష్ మాట్లాడారు. భగత్‌సింగ్ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటంతో పాటు సోషలిజం కోసం తపించారని ప్రజానాట్య మండలి నాయకులు గండవరపు శేషయ్య తెలియజేశారు. కార్యక్రమంలో కాలేషా, మారుబోయిన సుబ్బారావు, పెరుమాళ్ళ హరి, అఫ్రోజ్, ఎస్థాని, మాబాషా, బాబు, చాంద్‌బాషా, కల్పన, ఫాతిమా, శివ, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.




ప్రజాశక్తి-కోవూరు శాఖ గ్రంథాలయంలో భగత్ సింగ్ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, పాఠకులు, జె సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : నేటి యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కమిటీ సభ్యులు తాళ్లూరి మాలాద్రి పేర్కొన్నారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ కావలిలోని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన పోరాట యోధుడు, దేశం కోసం తన ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా పోరాడిన మహెూన్నత వ్యక్తిని, దేశ స్వాతంత్ర్యం కోసం పేద ప్రజల విముక్తి కోసం తన ప్రాణాల సైతం లెక్కచేయకుండా పోరాడిన గొప్పనేత భగత్ సింగ్ అని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని, యువత ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణయ్య, మధు, కమలాకర్, సురేష్, సిపిఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : విప్లవ జ్యోతి స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. మండలంలోని దామరమడుగు గ్రామంలో భగత్ సింగ్ 94వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవ వీరులను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు వెళ్లాలన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగులు నానాటికి పెరిగిపోయి యువతలో నిరాశ నిస్పృహలు అలుముకుంటున్నాయని అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉద్యోగ కల్పన చేయకుండా మనువాద సిద్ధాంతాలు ముందుకు తీసుకుని వెళుతుందన్నారు. ఈ ప్రయత్నాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. చరిత్రను మారుస్తూ ప్రజల్లో అలజడులు సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నో వందల యేళ్ల క్రితం జరిపిన సంఘటనలు మళ్లీ తిరగదోడుతూ ప్రజలను భావోద్వేగాల్ని రెచ్చగొడుతూ తన పబ్బం గడుపుకుంటున్నారన్నారు. దేశంలో ఒకరిద్దరు పెట్టుబడీదారులు ప్రోత్సహిస్తూ దేశ సంపదను వారికి దోచి పెడుతున్నారన్నారు. యువత సంఘటితమై కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గండవరపు ఓంకార్, గుండాల సతీష్, వంజీవాక కృష్ణప్రసాద్, గరికిపాటి సురేష్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు 'విపిఆర్'

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్



ట్రైసైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం

విశాలమైన మనసున్న సేవాతత్పరుడు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కొనియాడారు. ఆదివారం ఉదయం పట్టణంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సారథ్యంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీని పండగ వాతావరణంలో నిర్వహించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ.60లక్షలు విలువచేసే 150 ఎలక్ట్రిక్ మోటార్ ట్రై సైకిళ్లు మంత్రి ఆనం, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్‌సి బీద రవిచంద్ర పంపిణీ చేశారు. వికలాంగుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ట్రై సైకిళ్లు అందజేశారు. రూ.40వేలు విలువచేసే ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ను ఉచితంగా అందజేయడంపై తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ నేతలకు వికలాంగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంటు చరిత్రలో సరికొత్త సువర్ణ అధ్యాయానికి విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. పండగ వాతావరణంలో వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేయడం ఆత్మకూరులో అరుదైన విశేషంగా మంత్రి పేర్కొన్నారు. ఆత్మకూరులో 150 మంది వికలాంగులకు ట్రై సైకిల్ అందించారని, ఇంకా ఎవరైనా అర్హత ఉండి ట్రై సైకిల్ అందని వారి ఉంటే వారికి కూడా అందించాలని ఎంపి వారి సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు చాలామంది వికలాంగులు తన వద్దకు వచ్చి గ్రామాలకు వాటర్ ప్లాంట్స్ ఇస్తున్నారు కదా.. అదేవిధంగా తమకు కూడా ట్రై సైకిళు అందించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చేశామన్నారు. ఇప్పటికే కోవూరులో 250, ఉదయగిరిలో 150, కందుకూరులో 150, ఆత్మకూరులో 150 ట్రైసైకిళ్లు అందించామని, త్వరలోనే మిగిలిన మూడు నియోజకవర్గాల్లో కూడా అందిస్తామన్నారు. ఆత్మకూరు పట్టణంలో స్థానిక ఎంఎల్‌ఎ, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. వికలాంగులందరూ ఈ ట్రై సైకిళ్లను సద్వినియోగం చేసుకొని ఆత్మస్థైర్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి బీద రవిచంద్ర, టిడిపి సీనియర్ నాయకులు మెట్టుకూరు ధనుంజయ్ రెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు శ్రీహరి నాయుడు, కొమ్ము లక్ష్మయ్య నాయుడు, ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, మండల రూరల్ అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలయ్య చౌదరి, కేత విజయభాస్కర్ రెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, గొట్టి గుండాల బుజ్జిరెడ్డి, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



కావలి వాసికి రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి బిట్రగుంట

విజయ వాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇటీవల జరిగిన ఎపి తెలుగునాడు ఆటో డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల్లో కావలికి చెందిన టిఎన్‌టియుసి కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి మహేంద్రకు టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టిముక్కల రఘు రామ రాజు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కష్టపడి పని చేసి నందుకు కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కావలి నియోజకవర్గం తరఫున తనను సిఫార్సు చేయడం జరిగిందని, నెల్లూరు జిల్లా తరఫున ఈ అవార్డును అందుకోవడం జరిగిందని, జిల్లా తరఫున ఎన్నికైన ఏకైక వ్యక్తిని తానేనని మహేంద్ర తెలిపారు. సిఫార్సు చేసిన ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి మహేంద్రను అభినందించారు.

కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి పట్టణానికి పెనుకొండ క్షేత్రం పీఠాధిపతి బాలస్వామిజీ వస్తున్నట్లు కావలి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రమేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద ఉన్న కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యులతో కలిసి తటవర్తి రమేష్ సమావేశం నిర్వహించారు. తటవర్తి రమేష్ మాట్లాడుతూ బాలస్వామీజీ వారు ముందుగా శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానానికి విచ్చేస్తున్నట్లు తెలిపారు.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో తనిఖీ

ప్రజాశక్తి-బిట్రగుంట : జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ఎపి మత్స్యశాఖ కమిషనర్ ఆదివారం సందర్శించారు. అక్రమ పొరపాట్లు చేస్తున్న తమిళనాడు బోట్లు అరికట్టే విధంగా మరేం పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరామ్ శంకర్ నాయక్, నాగేశ్వరరావు, ఎస్ శ్రీనివాసులు, మెరైన్ పోలీసు అఫీషియల్స్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కావలి పట్టణంలోని జెండా చెట్టు సెంటర్ వద్ద గల మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా వడ్డించారు. ముందుగా మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. 28వ తేదీ ఎంఎల్‌ఎ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద నిర్వహించే ఇఫ్తార్ విందు కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముస్లిములు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయన రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, మాజీ సోమశిల డైరెక్టర్ కండ్లగుంట మధుబాబు నాయుడు, ముస్లీం సోదరులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎంఆర్‌ఎఫ్ నిధులు

ప్రజాశక్తి-విడవలూరు



ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) చెక్కులతో కష్టాలలో వున్న ప్రజలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని విడవలూరు, కొడవలూరు, బుచ్చి, కోవూరు, ఇందుకూరుపేట మండలాలకు చెందిన18 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9నెలలో కోవూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు విడతలలో 103 మందికి రూ.1 కోటి 49 లక్షల 74వేలు విలువ చేసే చెక్కులు అందజేశారన్నారు. 8వ విడతగా 18 మందికి రూ.19 లక్షల 95వేలతో పాటు ఇప్పటి వరకు 8 విడతలలో మొత్తం రూ.1 కోటి 69 లక్షల 70 వేలు చెక్కులు అందజేశారన్నారు. పేదలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట టిడిపి మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర నాయుడు, అడపాల అనీష్ రెడ్డి, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ తాళస్వామి, టిడిపి నాయకులు కరకట్ల మల్లికార్జున, వంశీధర్ రెడ్డి, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.